క్లుప్తంగా

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



రామారెడ్డి : మండలంలోని పోసానిపేట గ్రామంలో మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగ్ర నర్సింలు, ఉపాధ్యక్షులుగా బండి పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా సుతారి సత్యం, కోశాధికారిగా టంకరి లింగంను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కనుగొందుల దర్శనం, బండి నరేష్, పాలికల సత్యనారాయణ. ముదాం నర్సింలు. గాజుల మల్లేష్, సుతారి నరేష్, బండి శివరాజు, వల్లూరి సిద్దయ్య, చిందం పెద్ద గంగారాం, చిందం వసంత్ ఎన్నుకున్నారు.

నాగిరెడ్డిపేటలో చెక్‌పోస్ట్ ఏర్పాటు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జిల్లా సరిహద్దులో ఉన్న నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. జిల్లా నుండి గోవుల అక్రమ రవాణా జరగకుండా ముందస్తుగా నివారించేందుకు జిల్లా సరిహద్దులో ఉన్న నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఎదుట చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. జిల్లా నుండి అక్రమంగా గోవులు తరలివెళ్లకుండా జిల్లాను దాటి వెళ్లే ప్రతి వాహనాన్ని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్నారు. కాగా అక్రమంగా ఎవరైనా గోవులను తరలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై రాజు తెలిపారు.

సత్సంగంతో ఎంతో ప్రయోజనం



కామారెడ్డి అర్బన్ : భగవద్గీతను నేర్చుకోవడానికి ఇస్కాన్ సత్సంగం ఎంతగానో ఉపయోగ పడుతుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్యం సంఘం(ఇస్కాన్) ప్రతినిధి శివానంద ప్రభు అన్నారు. ఆదివారం ఇస్కాన్ కామారెడ్డి సెంటర్‌లో భగవద్గీత సత్సంగం నిర్వహించగా శివానంద ప్రభు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భజనలు, నృత్యాలు చేశారు. హరేకృష్ణ జగన్నాథ్ బలదేవ్ సుభద్ర, గౌరనీతాయి శ్రీశ్రీ రాధమాధవ్, నరసింహదేవ్, లడ్డు గోపాలజీలకు నైవేద్యాల అనంతరం అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఇంచార్జి వెంకటదాస్ ప్రభు, యుగల్ కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పిట్లం(జుక్కల్) : వాహనదారులు తప్పకుండా ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. ఆయన ఆదివారం మండలంలోని పిట్లం–బాన్సువాడ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు, ధృవపత్రాలు లేని వాహదారులకు జరిమానా వేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పందరి, సాయగౌడ్ పాల్గొన్నారు.

నాడు హరితశోభితం నేడు కళావిహీనం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్ చెరువు కట్టను అప్పటి సర్పంచ్ వెంకటరమణారావు మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కట్టకు ఇరువైపులా ఇతర రాష్ట్రాల నుంచి మొక్కలను తెప్పించి నాటించారు. వాటికి ట్యాంకర్ల ద్వారా నీరు పోయించి కాపాడడంతో అవి చెట్లుగా మారాయి. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండడంతో వారు ఎవెన్యూ ప్లాంటేషన్‌పై పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా హరితహారం మొక్కలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఏరువాకా సాగారో..

- సాగు పనుల్లో రైతన్న బిజీ
- వానాకాలం పంటలకు సిద్ధమవుతున్న రైతులు
- గ్రామాల్లో మొదలైన సందడి



మద్నూర్‌లో భూమిని సిద్ధం చేసుకుంటున్న రైతు



మద్నూర్ శివారులో పొలంలో చెత్త ఏరుతున్న రైతులు

మద్నూర్(జుక్కల్) : వర్షాలు కురవడం ప్రారంభం కావడంతో గ్రామాల్లో అన్నదాతల సందడి మొదలైంది. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో మండలంలోని రైతులు ముందుగానే సాగుకు సమాయత్తం అవుతున్నారు. రైతులు తమ చేలల్లోని కట్టెలను తొలగించి శుభ్రం చేసుకుంటున్నారు.

మరి కొందరు రైతులు చెరువుమట్టి, పశువులు, కోడి ఎరువులు చేలకు తరలిస్తున్నారు. రైతులు వేసవి లోతు దుక్కులు దున్నడంతో పంట దిగుబడులు పెరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు. అంతే కాకుండా చెరువుల్లోని నల్ల మట్టిని సైతం పొలాలకు తరలించారు. మండలంలో గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులను చేపట్టేందుకు వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేసుకుంటున్నారు. గట్టిగా రెండు వానాలు పడగానే విత్తనాలు వేసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈసారి సాగు విస్తీర్ణం అంచనా..

మండలంలో వ్యవసాయ సాగుకు అనువైన భూమి 50 వేల325 ఎకరాలు ఉంది. ఇందులో 6,100 ఎకరాల వరి, 150 ఎకరాల మొక్కజొన్న, 3,540 ఎకరాల పత్తి, 3,456 ఎకరాల పెసర, 4,120 ఎకరాల మినుము, 27 వేల ఎకరాల సోయా, 5 వేల ఎకరాల కంది, మిగిలినవి కూరగాయలు తదితర పంటలు పండిస్తారని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

విత్తనాలు అందేలా చూడాలి



ఈసారి వర్షాలు తక్కువగా ఉన్నాయని ఇక్కడ చర్చతో కొంత ఆందోళనగానే ఉంది. ఏఏ పంటలు వేయాలో అర్థం కాకుండా ఉంది. ఈ ఏడాది పంట పరిస్థితి ఏలా ఉంటుందో తెలియడం లేదు. మంచివి, నాణ్యమైన విత్తనాలు సరఫరా అయ్యేలా ప్రభుత్వం చూడాలి. కాలం ఎలా ఉంటుందో ఏమో ఆందోళనగా ఉంది.

– వట్నాల్ దత్తు, రైతు, మద్నూర్

డీలర్ల వద్దే కొనాలి..



నాణ్యమైన విత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు గ్రామాలకు వచ్చి విత్తనాలు విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయద్దు. లైసెన్స్ ఉన్న గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి వాటికి బిల్లులు తప్పకుండా తీసుకోవాలి. తొలకరి వాన కురవగానే తొందరపడి విత్తనాలు నాటవద్దు.

– రాజు, ఏవో, మద్నూర్

బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి : ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందినప్పటికీ ఎల్లారెడ్డి, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిల్లో ప్రజలు బీజేపీని ఆదరించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం బీజేపీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు నర్సింలు, సతీష్, నక్క గంగాధర్, రాజ్‌దాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మురికికూపంగా వాసవి కాలనీ



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం దేవునిపల్లి వాసవీకాలనీలోని అద్దె భవనంలో ఉంటున్న మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల, దేవునిపల్లి ప్రాథమిక పాఠశాల వెనుక వైపుల దృశ్యం ఇది. మున్సిపాల్ పాలకవర్గం నిర్లక్ష్యానికి ఇది మురికివాడగా తయారైందని వాసవీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికికాలువపై పైకప్పు వేసినప్పటికి రోడ్డు వేయనందున అధ్వానంగా తయారైందని అంటున్నారు. భవనాలు నిర్మించని ఖాళీ ప్లాట్లు ఉండడంతో నీరు చేరి దోమలు, ఈగలతో కంపువాసనతో మురికి కూపంగా తయారైందని, మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రోడ్డు వేస్తే సమస్య పరిష్కారం అవుతుందని వాసవీకాలనీ వాసులు కోరుతున్నారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి



మద్నూర్(జుక్కల్) : జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు (ఎల్‌కేఆర్)కు మంత్రి పదవి కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డిమాండ్ చేశారు. డోంగ్లీ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే విద్యావంతుడు, నియోజికవర్గానికి అభివృద్ధి చేయాలన్న పట్టుదల కలిగి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు శ్రీకాంత్ పటేల్, హన్మంత్, వెంకటేశ్, బస్వరాజ్ తదితరులున్నారు.

ప్రమాదకరంగా బావులు



బీబీపేట : మండలంలోని ఉప్పర్‌పల్లి నుంచి మాందాపూర్ గ్రామానికి ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణం చేశారు. అయితే ఇదే రోడ్డులో మూల మలుపు వద్ద ప్రమాదకరంగా బావి ఉంది. దాని చుట్టూ ముళ్ల పొదలు, చెట్లు ఉండడంతో అది బావి అని గుర్తుపట్టకుండా ఉంది. వాహనదారులు అదుపు తప్పితే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. రోడ్డువేసిన అధికారులు కూడా బావి వద్ద ప్రమాద సూచికలు కానీ, మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అడుగుకో గుంత.. తీరని చింత



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొయ్యగుట్ట తండా నుంచి మొగులాన్‌పల్లి, తిర్మలపూర్, కొత్తాబాది గ్రామం వరకు గల ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. అడుగడుగునా ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు మరమ్మతులు చేయించకపోవడంతో గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

నేడు కార్యదర్శులతో సమావేశం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మిషన్ భగీరథ నీటి సరఫరా, నల్లాలపై ఇంటింటికి వెళ్లి సర్వే చేయాల్సి ఉంది నాలుగు మండలాల జీపీ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. మిషన్ భగీరథ అధికారులు, బాన్సువాడ డీఎల్‌పీవోలతో సమావేశంలో మిషన్ భగీరథ నల్లాల సర్వే పై అవగాహన ఉందన్నారు. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్ మండలాల ఎంపీడీవో,ఎంపీవోలు, జీపీ కార్యదర్శులతో సమావేశం ఉంది అందరు హాజరు కావాలని కోరారు.

సంబురాల్లో బీజేపీ శ్రేణులు



లింగంపేటలో పటాకులు కాలుస్తున్న బీజేపీ శ్రేణులు



తాడ్వాయిలో..



పెద్దకొడప్‌గల్‌లో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మూడోసారి పీఎంగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, సాయన్న, దత్తురాం, పోశెట్టి, వెంకటేశం, ఎల్లేశం, నరహరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం బీజేపీ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నరేంద్రమోదీ పీఎంగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయడంతో పటాకులు కాల్చి స్వీట్లు పంచారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీలు తీశారు. కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



భిక్కనూరులో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న వైద్యురాలు

భిక్కనూరు : యునిసెఫ్ సమగ్ర శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ సమ్మర్ బూట్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ఈ క్యాంప్‌లో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 36 మందికి ప్రశంసా పత్రాలను సర్టిఫికెట్లను స్థానిక వైద్యురాలు స్రవంతి అందజేశారు. సైన్స్ మానవ జీవితంలో ఒక భాగమైందన్నారు. ఈ కార్యక్రమంలో అట్ ల్యాబ్ ఇన్‌చార్జి తమ్మల రాజు, సరిత రిసోర్స్ పర్సన్లు వెంకటేష్, సాయిలు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో నాయక్‌పోడ్ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో..

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : కామారెడ్డి జిల్లా నాయక్‌పోడ్ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయక్‌పోడ్ విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించినందుకు స్థానిక డీపీఎల్ గార్డెన్‌లో సన్మానం చేశారు. జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాయిలు, రాంగోపాల్ తదితరులున్నారు.

లారెక్కిన రైలు



సదాశివనగర్ మీదుగా లారీపై వెళ్తున్న రైలింజన్

రామారెడ్డి : హైదరాబాద్ వైపు నుంచి మహారాష్ట్ర వైపునకు లారీపై రైలింజన్ వెళ్తున్న దృశ్యాన్ని స్థానిక ప్రజలు ఆశ్చర్యంగా తిలకించారు. సదాశివనగర్ మండల కేంద్రం శివారులోని 44వ జాతీయ రహదారిపై ఈ దృశ్యం కనిపించింది.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామసంకీర్తనలతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర్లు, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రెండవ శనివారం కావడంతో తాడ్వాయి మండలం నుంచే కాకుండా మెదక్, కరీంనగర్, హైద్రాబాద్, అధిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఈ భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా పోచమ్మకు బోనాలు



బీబీపేట : మండల కేంద్రంలోని పోచమ్మ అమ్మవారికి హరిజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, బైండ్లోళ్ల ఆట పాటలతో ప్రధాన వీధుల గుండా ఊరేగించి ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతే కాకుండా మృగశిర కార్తీ సందర్భంగా పలు కుటుంబాలు వనభోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో హరిజన సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మాతా లచ్చమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



మద్నూర్(జుక్కల్) : మండలంలోని సుల్తాన్‌పేట్‌లో ఆదివారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో మాతా లచ్చమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సమీపంలోని లచ్చమ్మ పురాతన ఆలయ స్థలంలో గ్రామస్తులు నూతన ఆలయం నిర్మించారు. ఖత్‌గావ్ మహారాజ్ ఆధ్వర్యంలో లచ్చమ్మ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. మహిళలు బోనాలు తీశారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు.

గ్రామ దేవతలకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పర్మళ్ల, సజ్జన్‌పల్లి, ఎక్కపల్లి, కోమట్‌పల్లి గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహిళలు ఇంటింటికీ బోనం తీసుకొని గ్రామాల్లోని వీధుల్లో డప్పు వాయిద్యాలు, పోతరాజు విన్యాసాలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం గ్రామాల శివారులోని గ్రామ దేవతలు, దుర్గమ్మ, ముత్యాల పోచమ్మ, ఎల్లమ్మ, కట్ట పోచమ్మ ఆలయాల చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ అభివృద్ధి కోసం విరాళం

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం కామారెడ్డికి చెందిన దివంగత కుసుమ నర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కోడళ్లు, కుమారులు రాజేష్ , మహేశ్వరి, రమేష్, శిరీష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి వారి చిత్ర పటాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్ కుమార్, లక్ష్మణ్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో ఆదివారం సాయంత్రం పెద్దమ్మ తల్లి బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల ప్రదర్శన చేపట్టారు. ఇంటింటి ఒక్కొక్క బోనం చొప్పున ముదిరాజ్ మహిళలు, ఆడపడుచులు బోనాలు ర్యాలీగా బయలు దేరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కాశీనాథ్, గున్కుల్ సొసైటీ వైస్‌చైర్మన్ గొట్టం నర్సింలు, మాజీ సర్పంచులు గోర్గంటి సంగమణి, గొట్టం అనుసూయ ముదిరాజ్ కులస్తులు కాయితి శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షిప్తం

శాఖాగ్రంథాలయానికి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయానికి జీపీల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని గ్రంథపాలకుడు రాజలింగం కోరారు. తాడ్వాయి మండలంలోని అన్ని జీపీ కార్యాలయాలు ఇళ్ల నుంచి వసూలు చేసిన ఇళ్ల బిల్లుల నుంచి 8 శాతం గ్రాంట్‌ను గ్రంథాలయానికి చెలించాల్సి ఉంటుందన్నారు. 18 జీపీలకు గాను గ్రంథాలయానికి సుమారు రూ. 5లక్షలకు పైగా బకాయిలు రావాల్సి ఉందన్నారు. ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చొరువ తీసుకొని పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో కూడా ఎన్నోమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు పెండింగ్ బిల్లుల వివరాలను తెలిపినప్పటికి సరిగ్గా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, పొల్యూషన్ వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అమెరికా నుంచి ఇండియాకు వస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు స్వాగతం పలికేందుకు తాడ్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, బాబుమియా, జలంధర్ రెడ్డి, రాజు, మోహన్‌రెడ్డి, పులిబాబు, నర్సారెడ్డి, శివాజీ, కిష్టాగౌడ్ తదితరులు వెళ్లారు.

అధ్వానంగా రోడ్డు..



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : చినుకుపడితే గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వానొస్తే నడిచే పరిస్థితి లేకుండా పోయింది. మండలంలోని పెద్ద దేవిసింగ్ తండా మీదుగా టిప్పర్లు సమయంతో పలువురు అక్రమార్కులు నల్లమట్టి కొట్టడంతో రోడ్డుపై గుంతలు పడి వర్షం నీళ్ల నిలవడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ టిప్పర్లను అడ్డుకుంటేనే రోడ్లు బాగుపడతాయని తండావాసులు అంటున్నారు.